# శిలాశాసనం

యం. యస్. మూర్తి

"శేషయ్యా?"

"ప్రభూ!"

"ఈ పేపర్లోపడ్డ ఫొటో చూడు— ఎవరీ సుందరి?"

"ప్రసిద్ధ సినీమాతారండి — ఆమెది బొంబాయి—"

"మన సంస్థానంలోకూడా ఇలాంటి వాళ్ళెవళ్ళైనా వున్నారా?"

"ఇంకా అందమైనవాళ్ళే వున్నారండి—"

"ఈవిడకి మల్లే ఫిలిములలో నటిస్తారా వాళ్ళు?"

"నటించరండి—ఫిలిములలో నటించడమంటే ఏమిటో వారికి తెలీదు—కాని, ఈవిడకన్నా అందమైనవాళ్ళు మాత్రం వున్నారండి—"

"ఏం ప్రయోజనం? ఫిలిములలో నటించనితర్వాత ఎంత అందముంటే నేం? కొరుక్కుతింటామా ఆ అందాన్ని?"

"చిత్తం! నిజమేనండి—"

"ఫిలిములలో నటించరట! ఎందుచేతనోయి శేషయ్యా?"

"వారికి తెలీదండి ఆ విద్య—మన సంస్థానంలో ఫిలిం పరిశ్రమ లేదు—"

"ఎంత ఘోరం! ఎంతమంది అందగత్తెలు ఫిలిములలో నటించకండా వీళ్ళ కారిపోతున్నారు?"

"చిత్తం! తమరే ఇలా విచారిస్తున్నారండి—వాళ్ళు విచారించడంలేదు—వాళ్ళ సంసారసుఖాలతో వాళ్ళు తృప్తిపడి వున్నారండి."

"శేషయ్యా? ఇది నిజంగా విచారకరమైన సంగతి. మన ఆడవాళ్ళు యింత వెనకబడి వున్నారని నాకు తెలీదు—"

"చిత్తం! విచారకరమేనండి!"

"ఇంతవరకూ నువ్వీ విషయం నాకు తెలియజేయకపోవడం—"

"పొరబాటేనండి!"

"శేషయ్యా!"

"వెంటనే మన సంస్థానమంతా ఫిలిం పరిశ్రమకు పూనుకోవాలి—"


"ఇప్పుడేనాండీ?"

"సాక్షాత్తూ ఇప్పుడే! నువ్వు వెళ్ళి యాక్టర్లని బుక్ చెయ్యి—"

"నేనాండీ?"

"నువ్వేనండి—షో—మరి మాటాడకు—"

"నాకు గుండె దడొస్తోందండి—"




"ఫరవాలేదు—చూడూ, డైరక్టరుగా ఎవర్ని వేద్దాం?"

"మన సంస్థానంలో ఆ విద్యగలవారెవరూ లేరండి—"

"అయితే నువ్వే అన్నిటికీ తగినవాడివి—నిన్ను డైరక్టర్ను చేశా—"

"ప్రభూ! ఇంత దారుణం కూడదు—ఈ శిలాశాసనం—"

'ఏం?'

"డైరక్టరుగా వుండటమంటే నాకేమీ తెలీదు—నా మంత్రి వుద్యోగాన్ని ప్రశాంతంగా నిర్వహించనివ్వరులా వుంది—"

"ఫరవాలేదు — ఈ ఉద్యోగం ఆ ఉద్యోగం కూడా నువ్వే చేద్దువుగాని—"

"అసలు నాకు ఆ ఫిలిం డైరక్టరువనంటే ఏమిటో సుతరామూ తెలీదండి."

"ఎవరికీ తెలీదు — ముందుగా — నేర్చుకుందువు గాని—"

"ఈ వృద్ధుని ఇలా ప్రశాంతంగా బ్రతకనివ్వరూ?"

"శేషయ్యా! నీ ప్రశాంతికేమీ భంగం రాదు—వెళ్ళు—"

"నా బ్రతుకు తమ చెరలో వుంది—ఏం చేస్తారో?"

"భయంలేదు — చూడూ, మనం తియ్యబోయే ఫిలిముకు ఈ పేపర్లో పడ్డ నటీమణిలాంటి మనిషి కావాలి—"

"చిత్తం!"

"ఎక్కడ దొరుకుతారూ ఇలాంటి వాళ్ళు?"

"వాకేటు చెయ్యాలండి—"

"ఎందుకోయి ఈమాత్రం దానికి? మన సంస్థానంలో పేరువద్ద అంద గత్తెలు — ఈ బొమ్మలో మనిషిలాంటి వారు—ఎవరున్నారో నీకు తెలీదూ?"

"నాకెలా తెలుస్తుందండీ—అయినా అందమైన ఆడవాళ్లుండగానే సరిగాదండి—వాళ్లు ఫిలిములలోకి వచ్చి నటించడానికి ఇష్టపడొద్దూ?"

"వచ్చినట్టు ఇష్టపడతారు—కొరుక్కు తినేస్తామా వాళ్ళని? వొస్తారు కాస్త నటించి, నాలుగు పాటలుపాడి మనం ఇచ్చింది పుచ్చుకుని వెడతారు—ఇందులో తగనిపని ఏముందీ?

"ఏమీ లేదండి—కాని, వారికి ఈ మతలబులు అర్థం కావొద్దండీ?"

"అర్థమయ్యేట్టుగా మనం చెప్పాలి—ముందు అందమైన ఆడవాళ్ళు ఎక్కడున్నారో—కాస్త ఆలోచించి చెప్పు—"

"నాకెలా తెలుస్తుందండీ?"

"నీకిదివల్ల ఆమాత్రం తెలీదటోయ్ ఎవరు అందమైన వారయిందీనూ?"

"అక్కడక్కడ ఒకరిద్దరు అంద గత్తె లుండవచ్చునండి."

"ఆ ముక్క నువ్వు చెప్పేదేమిటీ? వారెవరని?"

"ప్రసిద్ధి గాంచిన అందంగలవాళ్ళు ఒకరిద్దరికంటే వుండరండి. మన సంస్థానంలో—"

ఒక రిద్దరే మనకు కావలసింది. మందలను తోలుకొచ్చి మనమేం చేసు కుంటాం?"

"నిజమేనండి—"

"ఆ ఒకరిద్దరిలోనూ ఎవరైనా తెలుసునా నీకూ?"

"చిత్తం! తెలుసునండి—"

"ఆమె భర్త ఆమె ఫిలిం రంగంలో ప్రవేశించడానికి అంగీకరిచే వాడేనా?"

"చిత్తం! తప్పకుండా అంగీకరిస్తాడండి. ఆమెన్ను ముందు మనం బుక్ చేస్తే అనేక మంది ఆమెను అనుస రిస్తారు—"

"తప్పకుండా బుక్ చేద్దాం వెంటనే వెళ్ళి—ఎవరావిడా? చాలా బాగుంటుందా—ఈ పేపర్లో తారాణికి వల్లే?"

"చిత్తం! అంతకన్న బాగావుంటుదండామె—ఆమె భర్తకూడా ఫిలిం పరిశ్రమ అంటే చెవి కోసుకుంటాడు—"

"శేషయ్యా! ఇంక కబుర్లతో కాలం వృధా చెయ్యకూడదు—ఎవరో చెప్పు వెడదాం—"

"చిత్తం! మనం ఎక్కడకూ వెళ్ళనక్ఖర్లేదండి. ఇక్కడనే—తమ అంతఃపురంలోనే వున్నారండి"

"శేషయ్యా! ఏమిటోయి, ఎవరిమాట నువ్వు అంటూంట?"

"చిత్తం! ఇంకెవరండీ! శ్రీ రాణి గారు!—"